క్లుప్తంగా

జేవీఆర్ ఓసీ ఫిట్ సెక్రటరీగా రమేష్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ఎస్అండ్‌పీసీ విభాగం ఫిట్ సెక్రటరీగా కాటం రమేష్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సింగరేణి జేవీఆర్ ఓసీ ప్రాంగణంలో ఫిట్ కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యాన ఫిట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూటీసీ సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకటేశ్వరరావు, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వీరస్వామి, కేజీఎం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య, సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ దారా భీమయ్య, పి.సూర్యప్రకాశరావు, బరిగల శేఖర్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఈఏపీ సెట్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం

వైరా: వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో ఈఏపీ సెట్(ఎంసెట్) కౌన్సెలింగ్‌పై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఏపీ సెట్ జిల్లా కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళాశాలల వారీగా ఉన్న కోర్సులు, ఎలాంటి కోర్సులకు భవిష్యత్ ఉంది, వెబ్ ఆప్షన్ల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలి


సింగరేణి ఎక్సైజ్ సీఐ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కారేపల్లి: ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని కోరుతూ.. కాంగ్రెస్ నాయకులు ఎక్సైజ్ సీఐ ప్రశాంతికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కారేపల్లిలో ఉన్న నాలుగు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యాన్ని విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు వినోద్ కార్యాలయంలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మేదరి టోనీవీరప్రతాప్, మండల పరిషత్ కోఆప్షన్‌మెంబర్ ఎండీ హనీఫ్, గుగులోత్ భీముడు, ధరావత్ వినోద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ


సన్మాన సభలో మాట్లాడుతున్న శ్రీధర్

పెనుబల్లి: మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన బి.మరియదాసు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ముత్తగూడెంలో నిర్వహించిన సభకి.. ముఖ్య అతిథిగా 327 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇనుగాల శ్రీధర్ హాజరై మాట్లాడారు. 1999 సంవత్సరం, ఆ తరువాత ఉద్యోగంలోకి వచ్చిన వారందరికీ పెన్షన్ అందేలా కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆ శాఖ ఉద్యోగులు మరియదాసు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, కంపెనీ అధ్యక్షులు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి వి.శీతారాం గోపాల్, ఆ శాఖ సిబ్బంది ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు గతేంటి..?


సీసీరోడ్డు నిర్మించడంతో రోడ్డు పక్కనే నిలిచిన మురుగునీరు

కారేపల్లి: వరద నీరు ప్రవహించేందుకు గతంలో కల్వర్టులు నిర్మించారు. అవి పాడవడంతో అధికారులు వాటికి మరమ్మతులు చేయకుండానే సీసీ రోడ్లు నిర్మించారు. ఈ క్రమంలో వరదనీరు వీధుల్లో, రోడ్ల వెంబడి పోటెత్తింది. దీంతో దోమలు, పందులు మురుగు కాలువల్లో స్వైరవిహారం చేయడంతో గ్రామ ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీల్లో పైసల్లేవు..

జీపీలను వేధిస్తున్న నిధుల కొరత
- కార్మికులకు అందని జీతాలు
- ఐదు నెలలుగా నిలిచిన నిధులు
- మండలంలో 27 పంచాయతీలు



కొణిజర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

కొణిజర్ల: గ్రామ పంచాయతీలలో పాలన నిలిచిపోయింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయి ప్రత్యేకాధికారులు రావడం, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధుల రాకపోవడంతో పంచాయతీల్లో కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిధులు లేక పనులు చేయించలేక జూనియర్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఇటీవల కొత్తగా పంచాయతీలుగా ఏర్పడ్డ తండాల్లో అయితే ట్రాక్టర్ కిస్తీలు కట్టే పరిస్థితి లేకుండా పోయింది. కొణిజర్ల మండలంలోని 27 పంచాయతీల్లో ఒకటి రెండు పంచాయతీలు మినహా అన్ని పంచాయతీలలో నిధుల లేమి కనబడుతుంది. మరోవైపు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వక పంచాయతీ కార్మికులు పని మానేసి వేరే పనులకు పోతామని చెబుతున్నారు.

పంచాయతీలకు అందని నిధులు..

మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో కొణిజర్ల, అమ్మపాలెం తనికెళ్ల, లింగగూడెం, సింగరాయపాలెం, పెద్దగోపతి పంచాయతీలు కొద్దిగా ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నెల నెలా వేసే నిధులతో ఇంతకాలం పంచాయతీలను కార్యదర్శులు నెట్టుకొచ్చారు. గత నాలుగు నెలలుగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల చేయడంలేదు. ఇక రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు గత ప్రభుత్వ హయాంలోనే నిలిపివేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 5 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో పంచాయతీ కార్యదర్శులు కొట్టు మిట్టాడుతున్నారు. గతంలో సర్పంచ్‌ల పదవీ కాలంలో అప్పులు తెచ్చి మరీ అభివృద్ధిపనులు చేయించారు. మండలంలోని గుబ్బగుర్తి సర్పంచ్ దాదాపు రూ.22 లక్షలు అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేపడితే పదవీకాలం ముగిసినా ఇంకా అందుకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. దీంతో సదరు సర్పంచ్ కోర్టులో కేసు వేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

నెలవారీ బిల్లులకు ఇక్కట్లు..

పంచాయతీల్లో ప్రతి నెల పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు జీతాలు, గత ప్రభుత్వం హయాంలో ఆర్భాటంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ల కిస్తీ, విద్యుత్ దీపాల మరమ్మతులు, నెల నెలా విద్యుత్ బిల్లులు, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు తదితర పనులకు ఖచ్చితంగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలంలో దాదాపు మూడు వంతుల పంచాయతీలలో జనరల్‌ఫండ్ రూ.10 వేలు కూడా లేకపోవడంతో సదరు బిల్లులు చెల్లించలేక పంచాయతీ కార్మికులు చేతులెత్తేశారు. ఇదివరకు సర్పంచ్‌లు కొద్దోగొప్పో ఇంటిపన్నులు వసూలు చేయించేవారు. ప్రస్తుతం వారి పదవీకాలం పూర్తికావడంతో వసూళ్లు మందకొడిగా సాగాయి. కనీసం 50 శాతం కూడా వసూలు చేయలేదు.

బ్లీచింగ్ కూడా కష్టమే..

వచ్చేది వానాకాలం పంచాయతీలలో దోమల బెడద లేకుండా చేయడానికి కనీసం వీధులలో బ్లీచింగ్ చల్లడానికి కూడా పంచాయతీలలో చిల్లగవ్వలేదంటున్నారు. మరోవైపు పంచాయతీల ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టి.. కనీసం జీపీల వైపుకూడా తిరిగి చూడటం లేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు, వారి మాతృశాఖ పనులు చూసుకోవడమే సరిపోతుంది. కొన్ని పంచాయతీలలో ఆర్థికంగా వెసులు బాటు ఉన్న నాయకులు సర్దుబాటు చేస్తున్నారు. లేదంటే చిన్నా చితక పనులకు పంచాయతీ కార్యదర్శులే భరించాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన రెండు ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శుల నెత్తినే పడింది. జీతాలు ఇవ్వని పరిస్థితుల్లో పని చేయాల్సిన అవసరం తమకు లేదని పంచాయతీ కార్మికులు అంటున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకుని పంచాయతీలకు నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



కొణిజర్ల మండలంలో ఇరవై ఏడు పంచాయతీలకు గాను దాదాపు 23 పంచాయతీల్లో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది జూలై నుంచి రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు రాలేదు. కేంద్ర ప్రభుత్వ వాటా అడపాదడపా వస్తున్నాయి. ట్రాక్టర్ల డీజిల్ పంచాయతీ కార్యదర్శులే భరిస్తున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు వస్తేనే పనులు చేయడానికి వీలుంటుంది.

– పి.ప్రభాకర్‌రెడ్డి, ఎంపీఓ, కొణిజర్ల

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి


జగన్నాథపురం పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న సింగరేణి జీఎం షాలేంరాజు

సత్తుపల్లి: మండలంలోని చెరుకుపల్లి గ్రామ పంచాయతీలోని జగన్నాథపురం గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆర్అండ్ఆర్ సెంటర్‌ను శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు సందర్శించారు. ఆర్అండ్ఆర్ పనుల స్థితిగతులను తెలుసుకొని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సివిల్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, టెంపుల్, కమ్యూనిటీహాల్, చర్చ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం జనరల్ మేనేజర్ క్యాంప్ ఆఫీసులో సత్తుపల్లి ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశమై కిష్టారం ఓసీ వద్ద పబ్లిక్ రోడ్‌పై ఇటీవల జరిగిన ప్రమాదాల దృష్ట్యా వాహనదారులకు రక్షణ సూచికలు, స్పీడ్ తగ్గించు రక్షణ పనులు, రోడ్డు అంచులు చూపించే విధంగా రేడియం స్టిక్కర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీఓ ఎం.వి.నర్సింహారావు, సివిల్ అధికారి ఎస్ఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామానికి చెందిన ధర్మసోత్ సింధు ప్రియ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తన ప్రతిభ చూపింది. అండర్ 20 బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. ఖమ్మం ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న క్రీడాకారిని సింధు ప్రియ రంగంబంజర గ్రామంలో ఆశ వర్కర్ శిల్ప, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్‌ల కుమార్తె. తనకు చిన్న తనం నుంచే కీరడలపై మక్కువ ఇష్టం. హనుమకొండలో నిర్వహించిన పదో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గురువారం పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో ఆమెకు సిల్వర్ మెడల్ అందజేశారు. ఆమె శుక్రవారం రంగంబంజర చేరుకోగా.. పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సింధు ప్రియ మాట్లాడుతూ.. కోచ్ వీర రాఘవుల ప్రోత్సాహంతో సిల్వర్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు.


సిల్వర్ మెడల్ అందుకుంటున్న సింధు ప్రియ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, మద్దునూరు, కేశ్వాపురం, రంగాపురం, పుణ్యపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాగులవంచ, పండిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో..

చింతకాని: మండలంలోని నాగులవంచ, పందిళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నుంచి సబ్‌స్టేషన్లకు వచ్చే విద్యుత్ మెయిన్ లైన్‌కు అడ్డుగా ఉన్నటువంటి చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

కేవీ గౌరారం విద్యుత్ ఉప కేంద్రంలో..

పెనుబల్లి: మండలంలోని కేవీ గౌరారం విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా గౌరారం, లింగగూడెం, పార్థసారధిపురం, భవన్నపాలెం, పెరికికుంట, వావిళ్లపాడు గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

బడిబాట పట్టిన ఉపాధ్యాయులు


సత్తుపల్లిటౌన్: ఎన్టీఆర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సుజాత


కల్లూరురూరల్: ముగ్గు వెంకటాపురం స్కూల్ వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్/కల్లూరురూరల్: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకుగాను ప్రభుత్వ ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. కల్లూరు మండలం, సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లి పట్టణంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత బాడిబాట కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పేరువంచ హైస్కూల్ హెచ్ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు ఎండి మౌలాలి, శ్రీనివాసరావు, శిరీష, గొల్లమందల సురేష్, పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, రామేశ్వరి, ఆదిలక్ష్మి, ఆగర్త, రాజ్యలక్ష్మి, ఉషా, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గంలో..


మధిరరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో.. ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిరరూరల్/ఎర్రుపాలెం: మధిరలోని చిలుకూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ నిడమానూరు సంధ్యా వంశీ, పాఠశాల హెచ్ఎం వూట్ల శంకర్ రావు మాట్లాడారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఫ్లెక్సీలతో బడిబాట ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, భూలక్ష్మి, సుజాత, అంగన్వాడి సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గంలో..


వైరారూరల్: గరికపాడులో 'బడిబాట' నిర్వహిస్తున్న దృశ్యం


ఏన్కూరులో..

వైరారూరల్/ఏన్కూరు: వైరా మండలంలోని గరికపాడు జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు శుక్రవారం లింగన్నపాలెం, దాచాపురం గ్రామాల్లో ఇంటింటికి తిరి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సైదయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పదిమంది పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు వారి తల్లీదండ్రులతో మాట్లాడి ఒప్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాఘవారావు, శంకర్ రావు, సాగి సుజాత, జయలీల, ప్రేమానందం, నాగేశ్వరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


చిన్న కాలువలాగా మారిన వాగు

వాగు ఆక్రమణలపై అధికారుల సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరురూరల్: మండలంలోని వంకర వాగు ఆక్రమణలపై జిల్లా అధికారులు సీరియస్ అయ్యారు. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం వంకర వాగు పరివాహక ప్రాంతాన్ని సర్వే చేపట్టారు. కల్లూరు నుంచి కనకగిరి గుట్టల వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర ప్రవహిస్తున్న వంకర వాగు పరివాహక ప్రాంతాన్ని అనేక మంది ఆక్రమించుకున్న వైనంపై 'సాక్షి'లో ఈ నెల ఒకటిన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సర్వేయర్ బొగ్గ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే చేపట్టి వాగు బౌండరీలను నిర్ధారించనున్నారు. ఆక్రమణకు గురైన భూములను గుర్తించి అవి ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వాగుకు సక్రమంగా సర్వే నిర్వహించి ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వంకరవాగుకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


వంకర వాగును సర్వే చేస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డ్రైడే, ఫ్రైడేపై గ్రామాల్లో అవగాహన


కల్లూరురూరల్: నిల్వ నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు


కల్లూరులో..

కల్లూరు/కల్లూరురూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నవ్యకాంత్ అన్నారు. కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటిని సందర్శించి పరిసరాల్లో నిలువ ఉన్న మురికి నీటిని నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున ఇంటి పరిసరాల్లో పూల కుండీలు, పాత టైర్లు, కూలర్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉంటే దోమలు సోకి మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగీ తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఈ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గుండపనేని రామారావు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మధిర: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు వీరబాబు అన్నారు. శుక్రవారం నాగవరప్పాడు, ఖాజీపురం గ్రామాల్లో ఎన్సీడీ స్క్రీనింగ్, ఫ్రైడే.. డ్రైడే, డీ వాటరింగ్ క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరబాబు మాట్లాడుతూ.. దోమల పెరుగుదలను నియంత్రించాలని కోరారు. ఆహార నియంత్రణ, వ్యాయామం, నడక, పోషక విలువలు కలిగిన ఆహారం తదితర ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. నెలకు సరిపడా ఉచితంగా అందించే మందులు, మల్టీ విటమిన్, బి కాంప్లెక్స్, క్యాల్షియం తదితర మందులను ఉచితంగా అందజేశారు. ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కరరావు, సత్యవాణి, సరస్వతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సదర్భంగా బిల్లుపాడు ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మం మాట్లాడుతూ.. బిల్లుపాడు పీహెచ్‌సీలో సరైన మందులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుపగా.. స్పందించిన వైద్యాధికారి రత్న మనోహర్ త్వరలోనే అన్ని పీహెచ్‌సీలకు మందులు వస్తాయన్నారు. తల్లాడ ఎంపీటీసీ దగ్గుల రఘుపతిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణ దిగువన ఉన్నందున వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిలిచి రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలకొడిమ ఎంపీటీసీ ఆదూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బస్వాపురంలో పాఠశాల శిథిలావస్థలో ఉందని, విద్యార్థులకు విద్య నభ్యసించాలంటే భయపడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రంగంబంజర పంచాయతీ వీధుల్లో నీరు నిలచి దోమలు వృద్ధి చెంది రోగాలకు నిలయంగా మారుతుందని ఎంపీటీసీ బానోత్ మోహన్ వాపోయారు. రేజర్ల, తెలగవరం గ్రామాల్లో వర్షాలు కురిస్తే మురుగు నీరు చేరి పారిశుద్ధ్య సమస్య తలెత్తే అవకాశం ఉందని ఎంపీటీసీ కొమ్మినేని ప్రభాకర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జేడీఏహెచ్‌ను సత్కరించిన గోపాలమిత్రలు


నారాయణను సన్మానిస్తున్న గోపాలమిత్రలు

వైరా: పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి వైరా పశుగణాభివృద్ధి శాఖ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కేవీ నారాయణను గోపాలమిత్ర సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపాల మిత్రల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు బి వెంకటేశ్వర్లు, కార్యదర్శి డి.శేషగిరిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కృష్ణయ్య, గోపాలమిత్రలు సుధాకర్, ఖాసీమ్, యాదగిరి, నాని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడి మృతికి సంతాపం

కొణిజర్ల: రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన తనికెళ్లకు చెందిన సీఐటీయూ నాయకుడు పేరసాని రామారావు మృతికి పలు పార్టీల నాయకులు తీవ్ర సంతాపం ప్రకటించారు. రెండు రోజుల క్రితం రామారావు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, సీఐటీయు జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా నాయకుడు షేక్ రంజాన్, రజకసంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు సీపీఎం మండల కార్యదర్శి కుటుంబరావు, సీపీఐ నాయకులు పీ వీ రావు, యాసా వెంకటేశ్వరరావు, తదితరులు సందర్శించి మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు.